క్లుప్తంగా

శాకంబరిగా ముత్యాలమ్మ



కూరగాయల అలంకరణలో ముత్యాలమ్మ

జామి: మండలంలోని అలమండ గ్రామంలో ఆషాఢమాస శుక్రవారం పురస్కరించుకుని స్థానిక ముత్యాలమ్మ ఆలయంలో అమ్మవారిని శాకంబరీగా అలంకరించారు. ఈ సందర్భంగా భక్తులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఎటువంటి ఇబ్బందులు కలగకుండా కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేశారు.

వాసవీమాతకు సారె సమర్పణ



వాసవీమాతకు సారె సమర్పిస్తున్న మహిళలు

జామి: మండల కేంద్రంలో కొలువైన వాసవీ కన్యకాపరమేశ్వరికి ఆషాఢమాసం సందర్భంగా ఆర్యవైశ్య మహిళలు శుక్రవారం సారె సమర్పించారు. ముందుగా అమ్మవారికి ఆలయ ప్రధానార్చకుడు రవికుమార్ శర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. మహిళలు లలితా సహస్రనామ పారాయణం చేశారు. కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

పరామర్శ..



తులసీరామ్ కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న మాజీ ఎంపీ బెల్లాన, తదితరులు

బొండపల్లి: మండలంలోని గొట్లాం గ్రామ మాజీ సర్పంచ్, వైఎస్సార్‌సీపీ జిల్లా నాయకుడు మీసాల తులసీరామ్ ఇటీవల మృతి చెందడంతో ఆయన సతీమణి, వైస్ ఎంపీపీ సరోజిని, కుటుంబ సభ్యులను మాజీ ఎంపీ బెల్లాన చంద్రశేఖర్ శుక్రవారం పరామర్శించారు. ఈ సందర్భంగా బెల్లాన మాట్లాడుతూ.. మంచి నాయకుడ్ని కోల్పోయామన్నారు. పరామర్శలో పార్టీ నాయకులు బొద్దల చిన్నంనాయుడు, మహంతి రమణ, బొద్దు అప్పారావు పాల్గొన్నారు.

పక్కాగా పారిశుధ్య పనులు



మరువాడలో గ్రామస్తులతో మాట్లాడుతున్న జిల్లా పంచాయతీ అధికారి మల్లికార్జునరావు

బొండపల్లి: పారిశుధ్య పనులు పక్కాగా చేపట్టాలని జిల్లా పంచాయతీ అధికారి డి.మల్లికార్జునరావు అన్నారు. మండలంలోని మరువాడలో శుక్రవారం ఆయన పర్యటించి పారిశుధ్య పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామంలో 43 శాతం పనులు మాత్రమే జరుగుతున్నట్లు ఆన్‌లైన్‌లో నమోదైందని.. పనులను పూర్తిస్థాయిలో చేపట్టాలని పంచాయతీ అధికారులను ఆదేశించారు. చెత్తను బయట వేయకుండా చెత్త సంపద కేంద్రాలకు తరలించాలని సూచించారు. కార్యక్రమంలో ఈఓపీఆర్‌డి రఘుపతిరావు, పంచాయతీ కార్యదర్శి సత్యవతి, సర్పంచ్ డి.పార్వతి పాల్గొన్నారు.

గంబూషియా చేపలతో దోమల నివారణ



చెరువులో చేప పిల్లలు విడుదల చేస్తున్న ఆరోగ్య సిబ్బంది

గంట్యాడ: గంబూషియా చేపలు దోమల లార్వాను తినడం వల్ల దోమల వృద్ధిని అరికట్టవచ్చని పెదమజ్జిపాలెం పీహెచ్‌సీ డాక్టర్ పల్లవి, డాక్టర్ సతీష్ అన్నారు. మండలంలోని బోనంగి గ్రామంలో గల చెరువులో దోమల నివారణ కోసం గంబుషియా చేప పిల్లలను శుక్రవారం వదిలారు. కార్యక్రమంలో ఈఓ రాజ్, హెల్త్ సూపర్‌వైజర్ తిరుపతి, ఆరోగ్య సహాయకులు ఈశ్వరరావు, ఎంఎల్‌పీ హరీష్, ఏఎన్ఎం శ్యామ్‌సుందరి, ఎస్. కోట సబ్ యూనిట్ ఆఫీసర్ శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

అన్నదాత సుఖీభవకు 6141 మంది అనర్హులు



బి.భానులత, ఏడీఏ

కొత్తవలస: కొత్తవలస సబ్‌డివిజన్ పరిధిలో ఉన్న కొత్తవలస, లక్కవరపుకోట, వేపాడ, జామి, శృంగవరపుకోట మండలాలకు చెందిన 6141 మంది రైతులను అన్నదాత సుఖీభవ పథకానికి అనర్హులుగా గుర్తించినట్లు వ్యవసాయశాఖ కొత్తవలస సబ్‌డివిజన్ ఏడీఏ బి.భానులత తెలిపారు. శుక్రవారం ఆమె మాట్లాడుతూ.. అనర్హుల జాబితాలను ఆయా గ్రామ సచివాలయాల నోటీస్ బోర్డుల్లో ప్రదర్శించినట్లు తెలిపారు. రైతులు తమ పేర్లను సరి చూసుకోవాలన్నారు. అర్హత ఉన్నట్లు భావిస్తే సచివాలయాల్లో ఫిర్యాదు చేయాలని సూచించారు.

ప్రజల్లోకి కూటమి మోసాలు..

- వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు మజ్జి శ్రీనివాసరావు



సమావేశంలో మాట్లాడుతున్న జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు

చీపురుపల్లి రూరల్ (గరివిడి): కూటమి ప్రభుత్వం మోసాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలని, ప్రజల తరపున పోరాటం చేయాల్సిన బాధ్యత మనందరిపై ఉందని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు అన్నారు. గరివిడి వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో శుక్రవారం సాయంత్రం గరివిడి మండల విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి పదమూడు నెలలు గడిచినా.. ఇంతవరకు కూడా ఎన్నికల హామీలను అమలు చేయకుండా చంద్రబాబునాయుడు ప్రజలను మోసం చేస్తున్నారన్నారు. ఇంతవరకు ఏ ఒక్క పథకం కూడా పూర్తి స్థాయిలో అమలు చేయలేదని ఆరోపించారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ప్రజలకు అన్ని రకాల సేవలను అందించామని.. ప్రతి కుటుంబానికీ లబ్ధి చేకూర్చామని చెప్పారు. చంద్రబాబునాయుడు అబద్ధపు హామీలతో అధికారంలోకి వచ్చారని.. ఏ ఒక్క హామీ కూడా అమలు చేయకుండా ప్రజలను మోసం చేస్తున్నారని మండిపడ్డారు. 'చంద్రబాబు ష్యూరిటీ..మోసం గ్యారెంటీ' కార్యక్రమంలో భాగంగా వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ మోసాలను వివరించాలని సూచించారు. ఈ ఏడాది కాలంలో సంక్షేమ పథకాల ద్వారా ఒక్కో ఇంటికి ఎంత ఆదాయం రావాల్సి ఉందో, చంద్రబాబు మోసాల వల్ల ఎంత నష్టపోయారో తెలియజేయాలన్నారు. ముందుగా మండలంలోని పెద్ద పంచాయతీల్లో ఈ కార్యక్రమాన్ని నిర్వహించి.. తర్వాత చిన్న పంచాయతీల్లో నిర్వహించి ఆగస్టు 15 నాటికి పూర్తి చేయాలని తెలిపారు. ధీరా ఫౌండేషన్ వ్యవస్థాపకుడు బొత్స సందీప్ మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వంలో మోసపోయిన ప్రజల పక్షాన నిలబడి పోరాటం చేయాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు మీసాల విశ్వేశ్వరరావు, మాజీ ఎంపీపీ కొణిశ కృష్ణంనాయుడు, వైస్ ఎంపీపీలు జి.రామకృష్ణరాజు, జి. శ్రీరాములనాయుడు, పంచాయతీరాజ్ వింగ్ జాయింట్ సెక్రటరీ లెంక శ్రీరాములు, స్టేట్ బూత్ కమిటీ వింగ్ జాయింట్ సెక్రటరీ యడ్ల అప్పారావు, పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు ఎలకల అప్పలనాయుడు, కొండపాలెం మేజర్ పంచాయతీ ఉప సర్పంచ్ బమ్మిడి కార్తీక్, అన్ని పంచాయతీల సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, నాయకులు పాల్గొన్నారు.

హామీలు అమలు చేసే వరకూ పోరాటం



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ యువ నాయకుడు బొత్స సందీప్



సమావేశానికి హాజరైన వైఎస్సార్‌సీపీ నాయకులు , కార్యకర్తలు

గుర్ల: కూటమి ప్రభుత్వం ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను అమలు చేసే వరకు ప్రజల పక్షాన నిలబడి నిరంతరం పోరాటం చేస్తామని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు , జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు అన్నారు. మండల కేంద్రంలోని బీవీఆర్ కల్యాణ మంటపంలో బాబు ష్యూరిటీ - మోసం గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా మండల వైఎస్సార్‌సీపీ నాయకులు , కార్యకర్తలతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం ఏర్పడి 13 నెలలైనా ఒక్కరికి కూడా కొత్త పింఛన్ మంజూరు చేయలేదన్నారు. గత వైఎస్సార్‌సీపీ హయాంలో ఆరు నెలలకోసారి కొత్త పింఛన్లు మంజూరయ్యేవని చెప్పారు. 50 ఏళ్లు దాటిన వారిందరికి పింఛన్లు మంజూరు చేస్తామని ఎన్నికల ముందు చెప్పి మోసం చేసిన ఘనత చంద్రబాబు, పవన్ కల్యాణ్‌కు దక్కుతుందన్నారు. రైతులు ఎరువులు కోసం నానా అవస్థలు పడుతున్న ప్రభుత్వం పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. బాబు ష్యూరిటీ - మోసం గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా వైఎస్సార్‌సీపీ నాయకులు ఇంటింటికీ వెళ్లి కూటమి సర్కార్ మోసాలను వివరించాలన్నారు.

పేద ప్రజలను మోసం చేశారు..

గత ప్రభుత్వం హయాంలో ఆర్థికంగా బలపడిన పేద కుటుంబాలు.. కూటమి ప్రభుత్వంలో ఆర్థికంగా బలహీన పడ్డారని వైఎస్సార్‌సీపీ యువ నాయకుడు, ధీరా ఫౌండేషన్ వ్యవస్థాపకుడు బొత్స సందీప్ అన్నారు. పేద , మధ్య తరగతి ప్రజలను కూటమి ప్రభుత్వం మోసం చేసిందన్నారు. ప్రతి పక్షంలో ఉన్నా ప్రజల పక్షాన పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పొట్నూరు సన్యాసినాయుడు, జెడ్పీటీసీ సభ్యుడు శీర అప్పలనాయుడు, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి కేవీ సూర్యనారాయణ రాజు , వైఎస్సార్‌సీపీ నాయకులు బెల్లాన బంగారునాయుడు , జమ్ము స్వామినాయుడు, కెంగువ మధుసూదనరావు, బోళ్ల సుబ్రహ్మణ్యం, తోట తిరుపతిరావు, అట్టాడ రామకృష్ణ, ఇజ్జిరోతు ప్రసాద్ , వైఎస్సార్‌సీపీ సర్పంచ్‌లు , ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

- కనక మహాలక్ష్మికి ఆషాఢం సారె..



కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లి కనకమహాలక్ష్మి అమ్మవారికి భక్తులు ఘనంగా సారె సమర్పించారు. ఆషాఢమాసంలో భాగంగా సంప్రదాయం ప్రకారం వస్తున్న సారె కార్యక్రమాన్ని శుక్రవారం వైభవోపేతంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణానికి చెందిన భక్తులు చీరలు, పండ్లు, స్వీట్లు, పిండి వంటలతో ఊరేగింపుగా వచ్చి అమ్మవారికి సారె సమర్పించారు. – చీపురుపల్లి

మాజీ ఎంపీని కలిసిన 'బొమ్మి'



మాజీ ఎంపీ బెల్లానను మర్యాదపూర్వకంగా కలిసిన వైఎస్సార్‌సీపీ రాష్ట్ర బీసీ సెల్ ప్రధాన కార్యదర్శి బొమ్మి శ్రీనివాసరావు, తదితరులు

చీపురుపల్లి: మాజీ ఎంపీ, పీఏసీ మెంబర్ బెల్లాన చంద్రశేఖర్‌ను వైఎస్సార్‌సీపీ రాష్ట్ర బీసీ సెల్ ప్రధాన కార్యదర్శి, బొబ్బిలి ఏఎంసీ మాజీ చైర్మన్ బొమ్మి శ్రీనివాసరావు శుక్రవారం చీపురుపల్లిలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా బొమ్మి శ్రీనివాసరావు మాట్లాడుతూ.. తనకు రాష్ట్రస్థాయి కమిటీలో చోటు కల్పించినందుకు మాజీ ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డికి, మాజీ ఎంపీ బెల్లానకు కృతజ్ఞతలు తెలియజేశారు. అనంతరం మాజీ ఎంపీ బెల్లాన చంద్రశేఖర్ మాట్లాడుతూ.. వైఎస్సార్‌సీపీలో కష్టపడి పని చేసే వారికి తగిన గుర్తింపు ఉంటుందన్నారు. పార్టీ అభివృద్ధి కోసం అహర్నిశలు కృషి చేయాలని సూచించారు. 2029లో వైఎస్సార్‌సీపీ అధికారంలోకి రావడం ఖాయమని స్పష్టం చేశారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన ఏడాది కాలంలోనే ప్రజల్లో తీవ్ర అసంతృప్తి వ్యక్తమవుతోందన్నారు. వైఎస్సార్‌సీపీ అధినేత జగన్ మోహన్‌రెడ్డికి ప్రజల నుంచి వస్తున్న ఆదరణ చూసి కూటమి నేతలు తట్టుకోలేకపోతున్నారన్నారు. కార్యక్రమంలో కూనాయవలస సర్పంచ్ బోడెల విజయబాబు, ఎంపీటీసీ మాజీ సభ్యుడు కర్రి సత్యనారాయణ, పార్టీ నేతలు బొమ్మి లక్ష్మంనాయుడు, కిలాడ సూర్యం, బొమ్మి సత్యనారాయణ, కలిగి తిరుపతి, బోడెల రామయ్య, తదితరులు పాల్గొన్నారు.

నేరాలను నియంత్రించండి

- డీఎస్పీ రాఘవులు



మాట్లాడుతున్న డీఎస్పీ రాఘవులు

చీపురుపల్లి: పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో నేరాలు, మహిళలపై అకృత్యాలతో పాటు ఎలాంటి అసాంఘిక కార్యక్రమాలు జరగకుండా నియంత్రించాల్సిన బాధ్యత మహిళా పోలీసులపై ఉందని డీఎస్పీ ఎస్. రాఘవులు తెలిపారు. సచివాలయ ఉద్యోగులకు ఇటీవల బదిలీలు జరిగిన నేపథ్యంలో మండలానికి కొత్తగా బదిలీపై వచ్చిన మహిళా పోలీసులతో శుక్రవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఎస్సై ఎల్.దామోదరరావుతో కలిసి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ.. గ్రామాల్లో ప్రశాంత వాతావరణం నెలకొనేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలన్నారు. ఎలాంటి అసాంఘిక కార్యక్రమాలు జరిగినా తక్షణమే పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించాలని సూచించారు. సచివాలయం పరిధిలో జరిగే ప్రతి విషయాన్నీ సబ్ ఇన్‌స్పెక్టర్‌కు తెలియజేయాలన్నారు.

పేదలకు అండగా ఉంటాం..

- మెజిస్ట్రేట్ విజయ్ రాజ్‌కుమార్



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న మేజిస్ట్రేట్ విజయ్‌రాజ్‌కుమార్

గజపతినగరం రూరల్: దారిద్ర్య రేఖకు దిగువన ఉన్న పేదలకు న్యాయ సలహాలు అందించే విషయంలో అండగా ఉంటామని స్థానిక జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ విజయ్ రాజ్‌కుమార్ అన్నారు. శుక్రవారం స్థానిక వెలుగు కార్యాలయంలో మహిళలతో సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చట్టాలు ఏం చెబుతున్నాయి, వాటిని మంచిగా ఎలా వినియోగించుకోవాలో అవగాహన కల్పించారు. ఎక్కడైనా వస్తువులు కొనుగోలు చేసినా, బ్యాంకుల్లో డబ్బులు వేసినా రశీదులు తీసుకోవాలని సూచించారు. అలాగే సమాజంలో మహిళలు - పురుషుల పాత్రపై అవగాహన కల్పించారు. ఆయనతో పాటు కోర్టు సిబ్బంది ఉన్నారు.

ప్రణాళికాబద్ధంగా చదవాలి

- ఎంఈఓ బాలభాస్కరరావు

వేపాడ: పదో తరగతి విద్యార్థులు ఇప్పటి నుంచే ప్రణాళికాబద్ధంగా చదవడంతో పాటు స్టడీ అవర్స్‌ను సద్వినియోగం చేసుకోవాలని ఎంఈఓ బాలభాస్కరరావు అన్నారు. సోంపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలను శుక్రవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా హాజరు పట్టికలు, రికార్డులు పరిశీలించారు. వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ కనబరచాలని ఉపాధ్యాయులను ఆదేశించారు. ఆయనతో పాటు హెచ్‌ఎమ్ బీపీఏ రాజు, తదితరులున్నారు.

చంద్రబాబు మోసాలను ప్రజలకు వివరించండి

- మాజీ ఎమ్మెల్యేలు కడుబండి శ్రీనివాసరావు, బొత్స అప్పలనరసయ్య



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు



హాజరైన నాయకులు, కార్యకర్తలు



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య

జామి: చంద్రబాబునాయుడు ఎన్నికల ముందు హామీలు గుప్పించి.. అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజలను ఏ విధంగా మోసం చేస్తున్నదీ ప్రతి ఇంటికీ వెళ్లి వివరించాలని గజపతినగరం, ఎస్.కోట నియోజకవర్గాల సమన్వయకర్తలు, మాజీ ఎమ్మెల్యేలు బొత్స అప్పలనరయ్య, కడుబండి శ్రీనివాసరావు అన్నారు. మండల కేంద్రంలోని సీతారామ కల్యాణ మంటపంలో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు గొర్లె రవికుమార్ అధ్యక్షతన శుక్రవారం నిర్వహించిన 'బాబు ష్యూరిటీ - మోసం గ్యారెంటీ' కార్యక్రమంలో వారు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఎన్నికల ముందు సూపర్ సిక్స్ హామీలు అమలు చేస్తామని వాగ్దానం చేసి అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజలకు గుండు సున్నా పెట్టారని ఆరోపించారు. కేవలం తప్పుడు హామీలు, లేనిపోని దుష్ప్రచారంతో టీడీపీ అధికారంలోకి వచ్చిందన్నారు. ఇచ్చిన హామీలు అమలు చేయకుండా చంద్రబాబు డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నారని మండిపడ్డారు. కూటమి సర్కారు అధికారంలోకి వచ్చిన దగ్గర నుంచి వైఎస్సార్‌సీపీ నేతలు, కార్యకర్తలపై అక్రమంగా కేసులు పెడుతున్నారన్నారు. చంద్రబాబు చేస్తున్న మోసాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని తెలిపారు. చంద్రబాబు ఎప్పుడూ పొత్తుల తోనే పోటీ చేస్తారు తప్ప సింగిల్‌గా ఎప్పుడూ బరిలోకి దిగలేదని చెప్పారు. కూటమి ప్రభుత్వం చేపట్టిన సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం ఫొటోలకే పరిమితమవుతోందన్నారు. ఇంటింటికీ వెళితే ప్రజలెక్కడ నిలదీస్తారోనని కూటమి నాయకులు భయపడుతున్నారని తెలిపారు. వైఎస్సార్‌సీపీ నిర్వహించిన వెన్నుపోటు కార్యక్రమాన్ని చూసి కూటమి పాలకుల్లో కదలిక వచ్చి తల్లికి వందనం పథకం అమలు చేశారని చెప్పారు. అన్నదాత సుఖీభవ, ఫ్రీ బస్సు, 50 సంవత్సరాలకు పింఛన్, నిరుద్యోగభృతి వంటి పథకాలు ఇంకా అమలు చేయలేదన్నారు. వైఎస్సార్‌సీపీ హయాంలో ఎన్నికల మేనిఫెస్టోను భగవద్గీత, బైబిల్, ఖురాన్ మాదిరిగా భావించి ఇచ్చిన హామీలు అమలు చేస్తే.. కూటమి నాయకులు అసలు మేనిఫెస్టోను పట్టించుకోవడం లేదని ఆరోపించారు. అనంతరం బాబు ష్యూరిటీ - మోసం గ్యారెంటీ కార్యక్రమం ప్రజల్లోకి ఏవిధంగా తీసుకువెళ్లాలి అన్న విషయమై దిశా నిర్దేశం చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ సబ్బవరపు అరుణ, జెడ్పీటీసీ సభ్యురాలు గొర్లె సరయు, యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు అల్లు అవినాష్, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి పొండ్రంకి సంజీవి, రాష్ట్ర యువజన విభాగం కార్యదర్శి ఫణిబాబు, నేతలు చలుమూరి సత్యారావు, అప్పాన సుబ్రహ్మణ్యం, జె.వెంకటలక్ష్మి, వైస్ ఎంపీపీలు గేదెల వెంకటరావు, ఎన్నింటి లక్ష్మి, పలువురు సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, పలువురు నేతలు తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా..

సకాలంలో జీతాలివ్వండి..

లక్కవరపుకోట: గ్రామాల్లో పారిశుధ్య పనులను నిర్వహిస్తున్న పారిశుధ్య కార్మికులకు జీతాలు సక్రమంగా ఇవ్వకపోవడం సిగ్గుచేటని సీఐటీయూ జిల్లా కార్యదర్శి కె.సురేష్ అన్నారు. మండల కేంద్రంలో గల ఎంపీడీఓ కార్యాలయం ఆవరణలో రెండు రోజులుగా పారిశుధ్య కార్మికులు చేపడుతున్న నిరసన దీక్షా శిబిరాన్ని శుక్రవారం ఆయన సందర్శించి సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ..అరకొరగా ఇస్తున్న రూ. 6 వేల వేతనం కూడా సక్రమంగా ఇవ్వకపోతే కుటుంబాలను ఎలా పోషించుకుంటారని ప్రశ్నించారు. వెంటనే కార్మికులకు న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయుకులు గాడి అప్పారావు, తరిణి వెంకటరమణ, తదితరులు పాల్గొన్నారు.

భూ సమస్యలు తలెత్తకూడదు..

గజపతినగరం: గ్రామీణ ప్రాంతాల్లో రైతులు సాగు చేస్తున్న భూములకు సంబంధించి ఎటువంటి సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని తహసీల్దార్ బి.రత్నకుమార్ అన్నారు. శుక్రవారం సాయంత్రం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో వీఆర్‌ఓలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులు తెలియజేసిన సమస్యలను పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో డీటీ శోభారాణి, తదితరులు పాల్గొన్నారు.

గ్రామసభల్లో ఆమోదం తప్పనిసరి

జామి: గ్రామ సమృద్ధి ప్రణాళికలు రూపొందించి గ్రామసభల్లో ఆమోదం తీసుకోవాలని ఐకేపీ ఏపీఎం టి. అప్పలనాయుడు అన్నారు. శుక్రవారం స్థానిక వెలుగు మండలి సమాఖ్య భవనంలో గ్రామ సంఘాల ఈసీ మెంబర్లు, వీఏఏలకు గ్రామ సమృద్ధి ప్రణాళికలపై శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా పలు అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సీసీలు జి.చినబాబు, పి.అప్పలనాయుడు, ఆర్.కిశోర్, సిబ్బంది సీహెచ్.లక్ష్మి పాల్గొన్నారు.

సంఘాలను బలోపేతం చేసుకోవాలి

గజపతినగరం: డ్వాక్రా సంఘ మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందుతూ తమ సంఘాలను బలోపేతం చేసుకోవాలని వెలుగు ఏపీఎం నారాయణరావు సూచించారు. శుక్రవారం స్థానిక వెలుగు కార్యాలయంలో వీఓఏలు, సీసీలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జీవనోపాధుల ప్రణాళిక, పబ్లిక్ ఆస్తుల సేవలు, వనరుల అభివృద్ధి, 2025 - 26వ సామాజిక అభివృద్ధి ప్రణాళిక, మొదలగు అంశాలపై శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో వెలుగు సీసీలు మూర్తి, సత్యనారాయణ, శేఖర్, రాము నాయుడు, కైలాష్, తదితరులు పాల్గొన్నారు.

శిక్షణ..

వేపాడ: గ్రామ సమృద్ధి స్థాపన ప్రణాళికలు తయారు చేయడంపై వీఓఏలు, సీసీలకు శుక్రవారం స్థానిక ఐకేపీ భవనంలో శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఏపీఓ సూర్యనారాయణ నేతృత్వంలో సీసీలు ద్రాక్షాయని, సత్యనారాయణ, మోహనరావు అభివృద్ధి ప్రణాళికల తయారీపై అవగాహన కల్పించారు.

ఏపీపీఆర్ఎంఈఏ అధ్యక్షుడిగా మోహనరావు

గంట్యాడ: ఏపీ పంచాయతీరాజ్ మినిస్టీరియల్ ఉద్యోగుల సంఘం (ఏపీపీఆర్ఎంఈఏ) గంట్యాడ యూనిట్ నూతన అధ్యక్షుడిగా ఎస్. మోహన్‌కుమార్ ఎన్నికయ్యారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎన్నికలు జరిగాయి. ఈ ఎన్నికను ఎల్‌వీ ప్రసాద్ పర్యవేక్షించారు. ఉపాధ్యక్షుడిగా కె. హేమసుందర్, కార్యదర్శిగా జి. ప్రసాద్, జాయింట్ సెక్రటరీగా వి. సూర్యనారాయణ, ట్రెజరర్‌గా బి. సత్యవాణి ఎన్నికయ్యారు.

నేడు మండల పరిషత్ సర్వసభ్య సమావేశం

జామి: మండల పరిషత్ సర్వసభ్య సమావేశం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శనివారం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ ఎన్. అప్పలనాయుడు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీపీ అధ్యక్షతన ఉదయం 11 గంటలకు సమావేశం ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. సమావేశానికి సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, మండలస్థాయి అధికారులు అందరూ హాజరుకావాలని కోరారు.

బంగారు కుటుంబాల జాబితా వెల్లడి

గంట్యాడ: మండలంలోని పెదవేమలి గ్రామ సచివాలయంలో బంగారు కుటుంబాల జాబితాను కార్యదర్శి ఆర్. వెంకటేశ్వరావు శుక్రవారం నోటీస్ బోర్డులో పొందుపరిచారు. కార్యక్రమంలో ఎంఎస్‌కే పి.కుమారి, డిజిటల్ అసిస్టెంట్ సుమ, అగ్రికల్చర్ అసిస్టెంట్ వి. రమేష్, తదితరులు పాల్గొన్నారు.

మట్టి విగ్రహాలే ముద్దు..

చీపురుపల్లి: ప్లాస్టర్ ఆఫ్ పారిస్ విగ్రహాలతో పర్యావరణానికి ఎంతో నష్టం కలుగుతోందని మానవీయత స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు బీవీ గోవిందరాజులు అన్నారు. ఈ మేరకు చీపురుపల్లి, గరివిడి ప్రాంతాల్లో వినాయక విగ్రహాలు తయారు చేస్తున్న కేంద్రాలకు శుక్రవారం వెళ్లి తయారీదారులకు అవగాహన కల్పించారు.

అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు



గ్రోమోర్ సెంటర్‌లో రికార్డులను పరిశీలిస్తున్న ఆర్డీఓ కీర్తి



దత్తిరాజేరు: పెదమానాపురం సంత వద్ద ఉన్న ఎరువుల షాపును పరిశీలిస్తున్న ఆర్డీఓ రామ్మోహనరావు

గంట్యాడ: ఎరువులు అధిక ధరలకు విక్రయించినా, కృత్రిమ కొరత సృష్టించినా చర్యలు తప్పవని విజయనగరం ఆర్డీఓ దాట్ల కీర్తి హెచ్చరించారు. మండలంలోని కొఠారుబిల్లి జంక్షన్‌లో ఉన్న మన గ్రోమోర్, వెంకటేశ్వర ఎరువుల దుకాణం, బాలాజీ ట్రేడర్స్‌లను శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించి నిల్వలతో సరిపోల్చారు. కార్యక్రమంలో తహసీల్దార్ నీలకంటేశ్వర రెడ్డి, మండల వ్యవసాయ అధికారి శ్యామ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

రికార్డుల పరిశీలన..

దత్తిరాజేరు: ఎరువులు, పురుగు మందులను అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు తప్పవని బొబ్బిలి ఆర్డీఓ రామ్మోహనరావు అన్నారు. ఏఓ అనురాధతో కలసి పెదమానాపురం సంత వద్దనున్న ఎరువుల దుకాణాన్ని తనిఖీ చేశారు. అధిక ధరలకు ఎరువులు విక్రయిస్తే చర్యలు తప్పవన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ విజయభాస్కర్, వీఏఏలు ఉన్నారు.



గరివిడి: ఎరువుల దుకాణంలో రికార్డులు పరిశీలిస్తున్న అధికారులు

తనిఖీలు

చీపురుపల్లి రూరల్(గరివిడి): గరివిడి పట్టణంలో గల ఎరువుల దుకాణాల్లో మండల వ్యవసాయాధికారి పి.ప్రసాదరావు, తహసీల్దార్ సీహెచ్ బంగార్రాజుతో కలిసి తనిఖీలు నిర్వహించారు. రికార్డులను పరిశీలించి నిల్వలను సరిచూశారు.